# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలో 3 కోట్ల మంది "లఖ్‌పతి దీదీ"లను తయారు చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యం నెరవేరిందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

- ❖ భారతదేశపు మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో నేడు సగానికి పైగా స్వచ్ఛమైన ఇంధన వనరుల నుంచే వస్తోందని కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడించారు.

- ❖ విద్యార్థి నిరసనల్లో పోలీసులు కఠినంగా వ్యవహరించారన్న ఆరోపణలు, పోలీసు సిబ్బందిపై జరిగిన హింసపై విచారణ జరిపేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

- ❖ కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికిగానూ జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించింది.

- ❖ శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ విజయం దిశగా పయనిస్తోంది.

==========================

దేశంలో మూడు కోట్ల మంది లఖ్‌పతి దీదీలను తయారు చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యం నెరవేరిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఇప్పుడు మరో మూడు కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ తదుపరి లక్ష్యమని ఆయన వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా సాధికారత కల్పించి, వారి వార్షిక ఆదాయాన్ని లక్ష రూపాయలకు పైగా పెంచే లక్ష్యంతో "లఖ్‌పతి దీదీ" కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశపు మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో నేడు సగానికి పైగా స్వచ్ఛమైన ఇంధన వనరుల నుంచే వస్తోందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడించారు. ఈరోజు ఆయన అధ్యక్షతన 12వ బ్రిక్స్ పర్యావరణ మంత్రుల సమావేశం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగింది. బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన పర్యావరణ మంత్రులు, ఉన్నతాధికారులు, విధాన రూపకర్తలు, నిపుణులు ఈ సమావేశంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. “బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టైనబిలిటీ” అనే ఇతివృతంతో నిర్వహించిన ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన భూపేందర్ యాదవ్.. మానవతకు ప్రాధాన్యమిచ్చే విధానంలో సుస్థిరమైన భూమండల నిర్మాణానికి విధానాలు, సాంకేతికత, ప్రజల భాగస్వామ్యాన్ని సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 2005 నుంచి 2022 మధ్య భారత్ కాలుష్య ఉద్గారాల తీవ్రతను 37 శాతానికి పైగా తగ్గించిందని కేంద్రమంత్రి తెలియజేస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ CNG ఆధారిత వాణిజ్య వాహనాలకు సంబంధించిన వయో పరిమితిని మరో ఐదేళ్ల పాటు పొడిగించే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. జాతీయ అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, డిజిటల్ విధానాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించడం లక్ష్యంగా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ 1989 నాటి కేంద్ర మోటారు వాహనాల నిబంధనలకు ప్రతిపాదించిన ముసాయిదా సవరణల్లో ఈ అంశాన్ని చేర్చింది. జాతీయ అనుమతి కలిగిన వాహన యజమానులు ప్రతి ఏడాది అనుమతిని పునరుద్ధరించాల్సిన అవసరం లేకుండా, గరిష్ఠంగా ఐదేళ్ల కాలానికి ఒకేసారి అనుమతి పొందే అవకాశం కల్పించాలని ముసాయిదాలో ప్రతిపాదించారు. ప్రస్తుతం వార్షిక రుసుము 16 వేల 500 రూపాయలుగా ఉండగా, ఐదేళ్ల కాలానికి 82 వేల 500 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల విద్యార్థులు చేసిన నిరసనల సమయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించారన్న ఆరోపణలు, పోలీసు సిబ్బందిపై జరిగిన హింసపై విచారణ జరిపేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కమిటీలో విశ్రాంత సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, మాజీ డీజీపీ, మాజీ సీబీఐ డైరెక్టర్ లు సభ్యులుగా ఉంటారని తెలిపింది. సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం.. కమిటీలో చేర్చాల్సిన ఇతర సభ్యుల పేర్లపై వివిధ పక్షాల నుంచి సూచనలు అందిన అనంతరం, కమిటీ ఏర్పాటు ఉత్తర్వులను రేపు విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ ఉన్నతస్థాయి కమిటీ వాస్తవాలను నిర్ధారించే బాధ్యతను చేపడుతుందని, విచారణకు అవసరమైన అన్ని సౌకర్యాలను కమిటీకి కల్పిస్తామని ధర్మాసనం పేర్కొంది. జులై 20న ఢిల్లీలో జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై పోలీసులు కఠినంగా వ్యవహరించారంటూ దాఖలైన పిటిషన్లతో పాటు.. పోలీసు సిబ్బందిపై హింసకు సంబంధించిన ఆరోపణలపై దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం ఈరోజు విచారించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖలో పర్యటిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఈ సాయంత్రం యువ సంవాద్ కార్యక్రమం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సుమారు గంట పాటు మాట్లాడిన ఆయన యువత ఆలోచనలు

తెలుసుకున్నారు. ఏం కావాలనే దానిపై యువతకు స్పష్టత ఉందని, అనేక విషయాలపై వారి అభిప్రాయాలు స్వీకరించానని నితిన్ నబీన్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గానూ జాతీయ క్రీడా పురస్కారాలును ప్రకటించింది. భారత మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో అగ్రశ్రేణి జోడీగా నిలిచిన ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి గోపీచంద్‌తో పాటు వివిధ క్రీడా విభాగాలకు చెందిన మరో 15 మంది క్రీడాకారులకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు అర్జున అవార్డు ప్రదానం చేయనున్నారు. అదే విధంగా, భారత ఫుట్‌బాల్‌లో సీనియర్ క్రీడాకారుడైన ఇసయ్యా అరుమైనాయగంకు అర్జున అవార్డు – జీవితకాల సాఫల్య పురస్కారం అందజేయనున్నారు. అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్ ఛోటే లాల్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నంద్‌కుమార్ చవాన్లకు ద్రోణాచార్య అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఇక పుణెలోని ఆర్మీ పారా ఒలింపిక్ నోడ్‌కు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం లభించనుంది. క్రీడా రంగంలో ప్రతిభను గుర్తించి, అత్యుత్తమ క్రీడాకారులు, కోచ్‌లను సత్కరించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతి ఏడాది జాతీయ క్రీడా పురస్కారాలను ప్రదానం చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాలే స్టేడియం వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ విజయం దిశగా పయనిస్తోంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. ధనంజయ డిసిల్వా 31, సోనల్ దినూష 25 పరుగులతో క్రీజులో కొనసాగుతున్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 2, సిరాజ్, ప్రసిద్ధ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత్ విజయానికి 6 వికెట్లు తీయాల్సి ఉండగా... శ్రీ లంక విజయానికి ఇంకా 288 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు ఈరోజు ఉదయం రెండో ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన భారత్ 193 పరుగులకే ఆలౌటైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల్లో వాయువ్య, ఈశాన్య భారతదేశంలో రుతుపవన పరిస్థితులు చురుగ్గా కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. దీంతో ఆయా ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =